# అమరుల ఆశయ సాధనకు యువత ముందుకు రావాలి

## పోచన్న, భూమన్నల 34వ వర్ధంతి సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పిలుపు

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం టౌన్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో మంగళవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కామ్రేడ్ కత్తెరమల్ల పోచన్న, ఆరుమమల్ల భూమన్నల 34వ వర్ధంతి సభ నిర్వహించారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు కె.ధర్మేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను సంఘటితం చేసి సమాజంలో సన్మార్గంలో నడిపించడంలో కామ్రేడ్ పోచన్న కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన ప్రజాదరణను సహించలేక అరాచక శక్తులు దారుణంగా హత్య చేశాయని పేర్కొన్నారు. అలాగే కామ్రేడ్ ఆరుమమల్ల భూమన్న ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడైన విషయాన్ని గుర్తుచేశారు. అమరుల ఆశయ సాధన కోసం ప్రతి ఏడాది వర్ధంతి సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో అమలవుతున్న ప్రజావ్యతిరేక విధానాలపై యువత ఐక్యంగా పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందని, బలమైన ప్రజా ఉద్యమాల ద్వారానే అమరులకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, పీవైఎల్ జిల్లా నాయకులు ఐ.కృష్ణ, ఈ.నరేష్, చిలుక శంకర్, మేరుగు చంద్రయ్య, ఐ.రాజేశం, కొల్లూరి మల్లేశం, కోడిపుంజుల జ్యోతి, బతుకుల రాజన్న, పైడిపల్లి రమేష్, బొంతు ఆనంద్, సమ్మెట తిరుపతి, దూలం సతీష్, ఈదునూరి బాబు, కోడిపుంజుల భూమేష్, తూళ్ల గట్టయ్య, ప్రసాద్, అవినాష్ తదితరులతో పాటు అరుణోదయ కళాకారులు కాసర్ల మల్లేష్, జనగామ భానేష్, అమరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## సింగరేణిలో ప్రమాదం

**కార్మికుడికి తీవ్ర గాయాలు**



**అగ్నిధార న్యూస్,( రామగుండం):** సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే-11 ఇంక్లైన్ గనిలో బుధవారం తెల్లవారు జామున ప్రమాదం జరిగింది. గనిలో బ్లాస్టింగ్ అనంతరం కోల్ కట్టర్ కార్మికుడు ఐలయ్య పనులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా బొగ్గు పెల్లలు విరిగి పడ్డాయి (సైడ్ ఫాల్). ఈ ఘటనలో ఐలయ్య నడుము, కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గని యాజమాన్యం వెంటనే ఆయన్ను గోదావరిఖని సింగరేణి ఆసుపత్రికి తరలించింది.విషయం తెలుసుకున్న ఐ ఎన్ టి యు సి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, ఏరియా వైస్ ప్రెసిడెంట్ సదానందం హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కార్పొరేట్ ఆసుపత్రికి రిఫర్ చేయించారు. వీరితో పాటు నాయకులు టైసన్ శ్రీనివాస్, బత్తుల పోచయ్య, ఆంజనేయులు, గంగాధర్, గాదె సంపత్ తదితరులు ఉన్నారు.

## జీడికే11 ఇంక్లైన్‌లో ప్రమాదం..

**కార్మికుడికి తీవ్ర గాయాలు**

**హైదరాబాద్ కార్పొరేట్ ఆసుపత్రికి తరలింపు**



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** సింగరేణి ఆర్జీ1 ఏరియా పరిధిలోని జీడికే11 ఇంక్లైన్ గనిలో బుధవారం తెల్ల వారుజామున జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం కోల్ కట్టర్‌గా పనిచేస్తున్న ఐలయ్య గనిలో బ్లాస్టింగ్ అనంతరం చెటాయి పనులు నిర్వహిస్తున్న సమయంలో సైడ్ ఫాల్ చోటుచేసుకోవడంతో బొగ్గు పెల్లలు అతనిపై పడినట్లు సమాచారం. ఈ ఘటనలో కార్మికుడికి నడుము భాగం, కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి.గాయపడిన కార్మికుడిని వెంటనే గని యాజమాన్యం గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించింది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే గుర్తింపు సంఘం ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, జీఎం కమిటీ సభ్యుడు సిద్ధమల్ల రాజు, గని ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్ ఆసుపత్రికి చేరుకుని గాయపడిన కార్మికుడిని పరామర్శించారు.కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించాలని నాయకులు వైద్యులను కోరగా, వైద్యుల సూచన మేరకు యాజమాన్యం అతనిని హైదరాబాద్‌కు రిఫర్ చేసింది.గనుల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేసి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘ నాయకులు ఈ సందర్భంగా యాజమాన్యాన్ని కోరారు.

# అండర్ డ్రైనేజీ పనుల్లో అవినీతి ఆరోపణలు

### ఇంటింటికీ రూ.300 వసూళ్లు

### రామగుండం 29వ డివిజన్‌లో కాంట్రాక్టర్ దందా?

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్‌లో చేపడుతున్న అండర్ డ్రైనేజీ పనులు అవినీతి ఆరోపణలకు కేంద్రబిందువుగా మారాయి. డ్రైనేజీ పనుల పేరుతో ఇంటింటికీ రూ.300 చొప్పున బలవంతపు వసూళ్లు చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ సిబ్బంది ప్రతి ఇంటి వద్దకు వెళ్లి తప్పనిసరిగా రూ.300 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు నివాసితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే పనులు చేయబోమని, కనెక్షన్లు ఇవ్వడంలో ఆలస్యం చేస్తామని బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు.ప్రభుత్వ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం ఏ మేరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పెరుగుతున్న జీవన వ్యయాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై అదనపు భారం మోపడం అన్యాయమని మండిపడుతున్నారు.ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డివిజన్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజా ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.



# అమరుల ఆశయ సాధనకు పోరాటం కొనసాగాలి

**కత్తెరమల్ల పోచన్న, ఆరుముల్ల భూమన్న 34వ వర్ధంతి సభలో పిలుపు**

**అగ్నిధార న్యూస్,( రామగుండం ):** రామగుండం హౌసింగ్ బోర్డు ప్రాంతంలో ఉన్న కామ్రేడ్ కత్తెరమల్ల పోచన్న స్మారక స్తూపం వద్ద మంగళవారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ ఆధ్వర్యంలో కత్తెరమల్ల పోచన్న, ఆరుముల్ల భూమన్నల 34వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు అమరుల స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో దోపిడీ, అసమానతలు, ఆధిపత్య విధానాలు కొనసాగుతున్నంతకాలం కమ్యూనిజం అజేయంగా కొనసాగుతుందని అన్నారు. కమ్యూనిజాన్ని అంతం చేస్తామనే ప్రయత్నాలు ఫలించవని, ప్రజల గుండెల్లో ఎర్రజెండా ఎల్లప్పుడూ సజీవంగా ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో విప్లవోద్యమం ఎదుర్కొంటున్న పరిస్థితులను అన్ని విప్లవ పార్టీలు సమీక్షించుకొని భారత భౌతిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజా విముక్తి పంథాను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అమరులు కలలుగన్న సమాన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పోరాటపథంలో ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా పివైఎల్ జిల్లా కార్యదర్శి కట్టా తేజేశ్వర్ స్మారక స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా జిల్లా నాయకులు తోకల రమేష్, గుమ్మడి వెంకన్న, ఈసంపల్లి రాజేందర్, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, కోడిపుంజుల లక్ష్మి, మార్త రాములు, ఇనుగాల రాజేశ్వర్, బుషిపాక దేవయ్య, తుళ్ల శంకర్, కాలువల రాయమల్లు, పారునంది నాని, కలువల క్రాంతి, క్యాదాసి సురేష్, సునీల్ కుమార్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.




# వైభవంగా సల్లూరి వినోద్ కుమార్ వివాహ వేడుక

**హాజరై ఆశీర్వదించిన నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం నేతలు**

**పలువురు సర్పంచ్‌లకు ఘన సన్మానం**

**అగ్ని ధార న్యూస్, (మంచిర్యాల):** నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం మంచిర్యాల జిల్లా యూత్ అధ్యక్షులు సల్లూరి వినోద్ కుమార్ - పల్లవిల వివాహ రిసెప్షన్ వేడుక దుగ్గినపల్లిలో బుధవారం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గోమాస శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు ఏసుకురి రాయమల్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన వధూవరులను పూలమాలలతో అభినందించి, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు.రిసెప్షన్ అనంతరం గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న పలువురు ప్రజాప్రతినిధులను సంఘం తరపున ఘనంగా సత్కరించారు. గురజాల సర్పంచ్ గోమాస శ్రీకాంత్, దుగ్గినపల్లి సర్పంచ్ లక్ష్మీ బానయ్య, పెద్దనపెల్లి సర్పంచ్ కలువల శరత్ గార్లను శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సీనియర్ నాయకులు సల్లూరి మోహన్, స్థానిక నాయకులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అతిథులు మరియు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెళ్లి కానుక అందించిన సర్పంచ్



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:** మహబూబ్ నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం యెల్కి చేరవు తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ సోమ్లా నాయక్ ఎలక్షన్లో ఇచ్చిన మాట ప్రకారం గ్రామానికి చెందిన బోయ రేణుక వివాహానికి రూ.5,116/-నగదు పెళ్లి కానుకగా అందజేశారు పేద కుటుంబాలకు అండగా ఉంటానని ఇచ్చిన మాట ప్రకారం అమలు చేయడంతో గ్రామస్తులు హర్ష వ్యక్తం చేశారు సర్పంచ్ సోమ్లా నాయక్ ఈ కార్యక్రమంలో బాలు నాయక్, తుక్యా నాయక్,కళ్యా నాయక్, అంజలయ్య , వెంకటేష్, నిల్యా నాయక్, శ్రీను, ఎల్లయ్య, లాలూ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో వివాహ వేడుకలకు హాజరైన మనాలి ఠాకూర్

**నూతన వధూవరులకు ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే సతీమణి**



**అగ్నిదార న్యూస్,(రామగుండం):** రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ ఆదివారం గోదావరిఖని ప్రాంతంలో నిర్వహించిన పలు వివాహ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభా కాంక్షలు తెలిపారు.వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆమె వధూవరులతో పాటు కుటుంబ సభ్యులను కలుసుకుని వారి దాంపత్య జీవితం ఆనందం, సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.ప్రజలతో మమేకమవుతూ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

## ప్రమాదకర డ్రైనేజీకి రక్షణ జాలీ ఏర్పాటు

**ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌కు ప్రజల అభినందనలు**




**అగ్నిధార న్యూస్,(రామగుండం):** గోదావరిఖని పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో వాహనదారులు, బాటసారులకు ప్రమాదకరంగా మారిన పెద్ద డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించింది. రక్షణ లేకుండా ప్రమాదానికి కారణమవుతున్న డ్రైనేజీపై ఇనుప గడ్డర్ల జాలీ ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ పనులను రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రత్యేక చొరవతో చేపట్టించడంతో ప్రమాదాలు నివారించబడుతున్నాయని ప్రజలు తెలిపారు. మార్కెట్ ప్రాంతంలో ప్రతిరోజూ అధిక రద్దీ ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండేవని, ప్రస్తుతం రక్షణ జాలీ ఏర్పాటు చేయడంతో ప్రజలకు భద్రత కలిగిందని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్న ఎమ్మెల్యేకు గోదావరిఖని ప్రజలు అభినందనలు తెలిపారు. పట్టణ అభివృద్ధి దిశగా కొనసాగుతున్న పనులే రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి నిదర్శనమని స్థానికులు తెలిపారు.

## ఆటో డ్రైవరా.. మజాకా

**ప్రజా నాయకుడిగా ఎదిగిన పర్లపల్లి రవి**

**ఇండిపెండెంట్‌గా గెలిచి రాజకీయాల్లో సత్తా చాటిన సాధారణ కార్మికుడు**



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** సాధారణ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించిన వ్యక్తి ప్రజల మద్దతుతో ప్రజా ప్రతినిధిగా అవతరించిన అరుదైన ఘటన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లో చోటుచేసుకుంది. ప్రభుత్వ, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు ధీటుగా పోటీ ఇచ్చిన ఆటో డ్రైవర్ పర్లపల్లి రవి ఇండిపెండెంట్ కార్పొరేటర్ అభ్యర్థిగా విజయం సాధించి రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షించారు.సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన పర్లపల్లి రవి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ స్థానిక ప్రజల్లో విశ్వాసం సంపాదించుకున్నారు. పార్టీ అండదండలు లేకుండానే ప్రజల మద్దతుతో విజయం సాధించడం విశేషంగా నిలిచింది. సాధారణ ఆటో డ్రైవర్ కూడా రాజకీయాల్లో రాణించి ప్రజా నాయకుడిగా ఎదగగలడని ఆయన నిరూపించారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.కార్పొరేటర్‌గా ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర ఆటో జేఏసీ, ఎంఆర్పీఎస్ నాయకులు పర్లపల్లి రవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాన్య వర్గాలకు చెందిన వ్యక్తులు ప్రజా సేవలో ముందుకు రావడం సమాజానికి శుభపరిణామమని పేర్కొన్నారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ పర్లపల్లి రవి ఈ సందర్భంగా తెలిపారు.

